క్లుప్తంగా

మహాన్నదానం



ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని సీతారామచంద్ర స్వామివారి ఆలయం ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయం వద్ద మహాన్నదాన కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు తదితర ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దర్శించుకున్నారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం స్థానిక రెవ డీఎల్ మోడీ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా డీఎల్ మోడీ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ జీవ రత్నం, సెక్రటరీగా పి.సామ్యూల్‌రాజు, ట్రెజరర్‌గా సీహెచ్ రత్నదీప్, జాయింట్ సెక్రటరీగా డి.ఏసురత్నం నియమితులయ్యారు. ఫెలోషిప్ ప్రెసిడెంట్ కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరంజ్యోతి, గౌరవాధ్యక్షుడు జయశీల్, ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరుల సమక్షంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వితరణ



బాలికల వసతి గృహానికి బ్యాంక్ అందించిన సామగ్రి

రాజమహేంద్రవరం సిటీ: కార్పొరేట్ సామాజిక బాధ్యతతో సమాజంలో అవసరమైన వారిని గుర్తించి, సహాయం అందజేస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఏవీ విశ్వేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రీజియన్ తరఫున విరాళంగా నగరంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహానికి సోమవారం ఇన్వర్టర్, స్టౌ, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు, ఇతర అధికారులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

సీటీఆర్ఐ: ధవళేశ్వరంలో ఉన్న క్రైస్తవ శ్మశాన వాటిక చుట్టూ వెంటనే ప్రహరీ నిర్మించాలని క్రైస్తవ మత పెద్దలు విజ్ఞప్తి చేశారు. స్థానిక లాలాచెరువు జంక్షన్‌లోని శాంతి నిలయం ప్రార్థన మందిరంలో రాజమండ్రి అర్బన్ అండ్ రూరల్ పాస్టర్ అసోసియేషన్, రాజమండ్రి క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ సంయుక్తాధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. పొన్నమాటి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని క్రైస్తవులందరికీ ఇచ్చిన ఈ బరియల్ గ్రౌండ్ నాలుగున్నర ఎకరాల భూమిలో ఉందని, స్థానికులకు ఇబ్బంది లేకుండా దీని చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని అభ్యర్థించామని తెలిపారు. ఆయన వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేశారని బాబ్జీ చెప్పారు. వెంటనే ప్రహరీ నిర్మించాలని సమావేశం తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో దహించుఅగ్ని ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ డాక్టర్ షీబా థామస్, కోశాధికారి బ్రదర్ కె.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సిబ్బంది, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు పనిచేయాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఆనం కళా కేంద్రంలో నూతన జీఓలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్, బిల్డర్లు ప్రజలకు అవగాహన కల్పించేలా చూడాలన్నారు. రుడా చీఫ్ ప్లానింగ్ అధికారి జీవీఎస్ఎస్ మూర్తి, రుడా ప్లానింగ్ అధికారి ఎస్.శ్రీనివాస్, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ జి.కోటయ్య, కుడా ప్లానింగ్ అధికారి వి.శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి తాపం.. మొక్కలకు దాహం

- నర్సరీలకు తీవ్ర సమస్య
- నీరందించే పనిలో రైతులు తలమునకలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి



కడియపులంకలోని ఓ నర్సరీ

కడియం: వేసవి వస్తోందంటే కడియం ప్రాంత నర్సరీ రైతాంగానికి కంటిమీద కునుకుండదు. నర్సరీల్లో మొక్కలను ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేందుకు సర్వప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. సమయానికి నీటిని అందించడంతో పాటు, ఎండ తీవ్రత బారిన పడకుండా మొక్కలకు షేడ్‌నెట్లు ఏర్పాటు చేయడం వరకు రేయింబవళ్లు కనిపెట్టుకునే ఉంటారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో రైతులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. షేడ్/సెమీ షేడ్ నెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, తగు మోతాదులో నీటిని అందించడం వంటి పనుల్లో బిజీగా ఉన్నారు. పగటిపూట ఎండ తీవ్రత, రాత్రిపూట మంచు కారణంగా విచిత్రమైన వాతావరణం ప్రస్తుతం నెలకొంది.

ప్రయత్నాలు ముమ్మరం

ఏటా వేసవి తాపం నుంచి మొక్కలను కాపాడుకునేందుకు చేసే రైతులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే విలువైన మొక్కలకు నీడనిచ్చే అవిసె గింజలను నాటడంతో పాటు, మొక్కజొన్న వంటి అంతర పంటలపైనా దృష్టి పెట్టారు. ఏపుగా పెరిగే ఈ మొక్కల కారణంగా వీటి కింద ఉండే నర్సరీ మొక్కలు ఎండ తీవ్రత నుంచి తప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లోడ్ రిలీఫ్, ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్, లైన్ రిపేర్ సర్వీసెస్ తదితర కారణాలతో విద్యుత్ కోతలు కూడా ప్రస్తుతం ప్రారంభమయ్యాయని రైతులు అంటున్నారు. పదేపదే విద్యుత్ సరఫరా ట్రిప్ అవుతుండడంతో మోటార్లను కనిపెట్టుకుని ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు.

కూలీల కొరత

వేసవి ఎండ తీవ్రత మొదలైందంటే నర్సరీ రంగానికి కూలీల కొరత కూడా వేధిస్తుంది. ఎండ ధాటికి పనులు చేయలేక, కూలీలు కూడా పనులకు రాని పరిస్థితి ఉంటుంది. దీంతో ప్రత్యామ్నాయాలపై కూడా రైతులు దృష్టి పెడుతున్నారు. రెయిన్‌గన్‌లు, స్ప్రింక్లర్లు తదితర సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థలపై వైపు కూడా రైతులు చూస్తున్నారు. గతంలో సబ్సిడీలపై ఆయా మైక్రో ఇరిగేషన్ పథకాలు అమలయ్యేవి. ప్రస్తుతం ఇప్పటి వరకు వీటికి సంబంధించి కచ్చితమైన విధివిధానాలను కూటమి ప్రభుత్వం ప్రకటించలేదని రైతులు అంటున్నారు. సోలార్ మోటార్లు, డ్రిప్, స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్స్ తదితర సంప్రదాయేతర నీటి పారుదల వ్యవస్థలను నర్సరీ రంగ రైతులకు అందుబాటులోకి తీసుకువస్తే, వేసవి ఎండల సమయంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని రైతులంటున్నారు.



నర్సరీలో మొక్కలకు నీటిని అందించేందుకు చేసిన ఏర్పాటు

రెండు రోజులకోసారి..

వేసవి ఎండల తీవ్రత అధికం అవుతున్న కారణంగా ప్రతి రెండు రోజులకోసారి మొక్కలకు నీటిని అందించాల్సి వస్తోంది. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితిని కన్పిస్తోంది. దీంతో విద్యుత్ మోటార్లను కనిపెట్టుకుని ఉంటున్నాం. ముమ్మందు ఎండల తీవ్రత పెరిగితే మరింతగా ఇబ్బంది పడాల్సిందే.

– బి.సత్యనారాయణ, నర్సరీ రైతు, కడియపులంక

వేసవిలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

మొక్కల ఎదుగుదల వేసవిలో బాగుంటుంది. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానికి తగు మోతాదులో నీటిని అందించాలి. లేకపోతే మొక్కలు చనిపోతాయి. ఎండ ధాటికి తోడు, భూమి కూడా కాలుతుంటుంది. ఈ కారణంగా ఎప్పటికప్పుడు మొక్కలను పరిశీలించి, నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

– కేవీ మణికంఠ, నర్సరీ రైతు, బుర్రిలంక

యువత నూతన ఆవిష్కరణలు చేయాలి

డీఎస్ఈఓ వాసుదేవరావు

కంబాలచెరువు: శాస్త్ర విజ్ఞానాన్వేషణలో దేశ యువత ప్రపంచ స్థాయిలో కీలక పాత్ర పోషించాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష సంయుక్తాధ్వర్యంలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి వాసుదేవరావు విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. బిక్కవోలు మండలం కొంకుదురు జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయుడు కృష్ణసాయి విద్యార్థులతో వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులతో భౌతిక, రసాయన శాస్త్రాల్లో వివిధ అంశాలపై ప్రయోగాలు నిర్వహించి, ఫలితాలు రాబట్టారు. అనంతరం సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలను జి.శేఖర్, ఆనంద్‌బాబు, హరిబాబు పర్యవేక్షించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ నెహ్రూ సైన్స్ దినోత్సవ కార్యక్రమాలను వివరించారు. జిల్లాలో 19 మండలాల నుంచి 150 మంది విద్యార్థులు, 19 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, ఎంఈఓ గౌరీశంకరరావు, ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ, లెక్చరర్ డీఎస్‌వీ సత్యనారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం షేక్ బహరేజియా పాల్గొన్నారు.

చికెన్ మేళాలతో విస్తృత ప్రచారం



చికెన్ మేళాకు ఎగబడిన ప్రజలు

సీటీఆర్ఐ: నగరంలో రెండు రోజులుగా ప్రత్యేక మేళాలు నిర్వహించి చికెన్ వంటకాలపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. బర్డ్ ఫ్లూ దెబ్బకు చాలా వరకు మాంసాహార ప్రియులు చికెన్ తినడం మానేయడంతో వాటి అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో చికెన్ వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉచితంగా చికెన్ వంటకాలు పెట్టి, దీనివల్ల ఎటువంటి వ్యాధులు రావని నిరూపిస్తే, కనీసం అప్పుడైనా చికెన్ అమ్మకాలు పెరుగుతాయని భావించిన సిటీ చికెన్ హోల్‌సేల్, రిటైల్ వర్తక సంఘం తరఫున ఫ్రీ చికెన్ మేళాలు నిర్వహిస్తున్నారు. స్థానిక జాంపేట మార్కెట్‌లో, ఆర్ట్స్ కళాశాల సెంటర్ వద్ద ఈ మేళాలు ఏర్పాటు చేసి, చికెన్, గుడ్లతో చేసిన వంటకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ మేళాలో చికెన్ తినడానికి మాంసాహార ప్రియులు పెద్ద సంఖ్యలో వచ్చి, చికెన్ వంటకాల వెరైటీలను రుచి చూసి వెళుతున్నారు. ఆది, సోమవారాల్లో కొద్దిగా చికెన్ సేల్స్ అందుకున్నాయిని, మంగళవారం ఇంకొంచెం పెరగవచ్చని సిటీ చికెన్ వర్తకులు భావిస్తున్నారు.

విద్యార్థి చదువుకు రెడ్డి జేఏసీ ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బొమ్మూరుకు చెందిన చిరుద్యోగి గుజ్జు నాగరాజారెడ్డి కుమారుడు గుజ్జు సాయిభార్గవ మోహనరెడ్డి విద్యాభ్యాసానికి అంతర్జాతీయ రెడ్డి జేఏసీ సోమవారం ఆర్థికసాయాన్ని అందజేసినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారపు రామకృష్ణారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ రెడ్డి జేఏసీ చైర్మన్ నావల్ల సత్యనారాయణరెడ్డి, జాతీయ అధ్యక్షులు మారం బాలబ్రహ్మ రెడ్డి సూచనతో విద్యార్థి సాయిభార్గవ 8, 9, 10 తరగతులు చదివించేందుకు రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విప్పల కుమారరెడ్డి బాధ్యత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎనిమిదో తరగతికి సంబంధించి రూ.20 వేల సాయాన్ని విద్యార్థి కుటుంబానికి అందజేసినట్టు రామకృష్ణారెడ్డి తెలిపారు.

8న ఆలిండియా ఇన్సూరెన్స్ మహిళా కన్వెన్షన్

రాజమహేంద్రవరం రూరల్: ఆలిండియా ఇన్సూరెన్స్ మహిళా కన్వెన్షన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఈ నెల 8న లక్నో నగరంలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్టు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. మోరంపూడి ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద సంఘ రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జే మాథ్యూస్, మహిళా ఉద్యోగుల కన్వీనర్ ఆర్.శిరీష, కో–కన్వీనర్లు కె.శ్రావణ శ్రీదేవి, కె.విజయదుర్గతో కలిసి కోదండరామ్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, లక్నోలో జరిగే మహిళా కన్వెన్షన్‌లో ఆర్.శిరీష పాల్గొంటారని తెలిపారు. ఇందులో దేశంలో వందకు పైగా ఉన్న ఎల్ఐసి డివిజన్ల నుంచి మహిళా ఉద్యోగుల కన్వీనర్లు హాజరవుతారన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, అసమానతలు, అత్యాచారాలపై, వాటి నివారణ, పరిష్కారాలపై విస్తృతంగా చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యులు శ్రీలత, ఉమాదేవి, రాజ్యం, భువనేశ్వరి, రమణ, శిరీష హారతి, ఎంవీ రమణ, నాయకులు గనెయ్య, విశ్వనాథ్, సత్యదేవ, శ్రీనివాసరావు, పీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, మహిళా ఉద్యోగులు

నిర్వాసితులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ తక్షణం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ధవళేశ్వరంలో ఉన్న పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ఎక్స్ అఫీషియో జాయింట్ కలెక్టర్, పోలవరం ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారి అభిషేక్‌ను ఆయనతో పాటు కమిటీ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. అనంతరం మార్టిన్ లూథర్ మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు 18,500 మంది ఉండగా, వీరిలో 6 వేల మందికి మాత్రమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ లభించిందని చెప్పారు. ప్యాకేజీ అందని వారి కోసం తక్షణం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం వల్ల సుమారు 30 గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తించదన్నారు. ఎత్తు తగ్గించడం వల్ల ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు అవ్వదన్నారు. ఆయన వెంట బృంద సభ్యులు, నాయకులు అడుసుమిల్లి రమేష్, చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరాలాల్, తాడాల కొండ్రాజు, పట్నాల శ్రీనివాస్, మేడవరపు భద్రం దొర, బర్రే సుబ్రహ్మణ్యం, పీఎస్ఎల్ రాజు తదితరులు ఉన్నారు.



ప్రాజెక్టు అధికారిని కలిసిన కమిటీ ప్రతినిధులు

వెండి వస్తువులు చోరీ

రాజమహేంద్రవరం సిటీ: కాతేరు సమీపంలో తిరుమల కాలేజ్ వద్ద ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. సుమారు రూ.3,500 విలువైన వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితురాలు ఆదిలక్ష్మి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన్య ప్రాణులను సంరక్షించాలి

ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ మూర్తి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పర్యావరణంలో కీలకమైన వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ బీఎస్ఎస్ మూర్తి అన్నారు. వన్య ప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ వ్యవస్థలో అడవులు, వన్య ప్రాణులు భాగమని, విస్తృత ఆహార వలయం సక్రమంగా సాగాలంటే వీటి మనుగడ తప్పనిసరని వివరించారు. అడవులు నానాటికీ తగ్గిపోతున్నాయని, అందువల్ల భూమిపై సమతుల్యత దెబ్బతిని.. అధిక ఉష్ణోగ్రతలకు, తద్వారా వన్య ప్రాణుల హానికి కారణమవుతోందని విశ్లేషించారు. ప్రతి ఒక్కరూ చెట్లను పెంచడం ద్వారా కొంతవరకు ఈ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులు రాష్ట్రాలను ప్రతిబింబించేలా భారత దేశ పటం రూపంలో ఏర్పడ్డారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, కాలుష్యం కూడా వన్య ప్రాణులు అంతరించిపోవడానికి కారణమవుతున్నాయన్నారు. కళాశాల ఆవరణలో మూర్తితో పాటు, యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలను నాటారు.



మొక్క నాటుతున్న ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ మూర్తి

ఒక్క ఎంఎన్‌వోకి 8 వార్డులా..!

ఆర్ఎంవోకు నాయకుల ఫిర్యాదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో ఎంఎన్‌వో(మేల్ నర్సింగ్ ఆర్డర్లీ), జీడీఏ(జనరల్ డ్యూటీ అటెండర్) విధుల కేటాయింపు వ్యవహారం వివాదాస్పదమైంది. ఒక్క ఎంఎన్‌వోకి 8 వార్డుల్లో డ్యూటీలు కేటాయించడం, మరో ఎంఎన్‌వో నేరుగా ఆర్ఎంవో వద్దే ఐదేళ్లుగా కొనసాగుతుండడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో విధుల కేటాయింపుల్లో చోటుచేసుకుంటున్న తప్పిదాలపై జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఎంవో ప్రణవ్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, సూపర్‌వైజర్‌గా కొనసాగుతున్న సీనియర్ ఎంఎన్‌వో రోస్టర్‌ను పాటించకుండా, స్వప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా డ్యూటీలు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈయనను ఆ బాధ్యతల నుంచి తప్పించి, మళ్లీ సూపర్‌వైజర్ బాధ్యతలను ఆయనకే ఇచ్చారని ఆర్ఎంవో దృష్టికి తీసుకువెళ్లారు. ఐదేళ్లుగా ఒకే స్థానంలో ఓ ఎంఎన్‌వో కొనసాగుతుంటే, అధికారులు పట్టించుకోకపోవడం వారి పర్యవేక్షణా లోపాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. మరో వైద్యుడి వద్ద ఇద్దరు జీడీఏలు రెండేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. కొందరు రెగ్యులర్ ఉద్యోగులు ఎంఎన్‌వోలుగా ప్రమోషన్ తీసుకున్నా ఆ విధులు నిర్వర్తించకుండా, అంతకు ముందు విధుల్లోనే కొనసాగుతున్నారన్నారు. అలాగే ఓ ఎంఎన్‌వో తన కుమారుడిని ఆస్పత్రిలో విధుల్లో కొనసాగేలా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రగ్స్ స్టోర్‌లో పనిచేస్తున్న పలువురు ఎంఎన్‌వోలను, జీడీఏలను మందుల పెట్టెలు మోసేందుకు వినియోగించడం ఏ మాత్రం సబబు కాదన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల పీఆర్‌వోలు ఆస్పత్రిలోకి అనధికారికంగా ప్రవేశించి కేసులను తరలిస్తున్నారని, వారికి సూపర్‌వైజర్ అండదండలు పుష్కలంగా ఉండడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు విన్న ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్ తక్షణమే సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభకు నివేదించి, చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పేద రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో నిబద్ధతను విడిచిపెట్టి, స్వప్రయోజనాలు ఆశించే ఏ ఒక్కరినీ సహించేది లేదని స్పష్టం చేశారు.

‘నన్నయ’లో నేటి నుంచి నారీ ఫెస్ట్–2025

- వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించే నారీ ఫెస్ట్–2025 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో మహిళలకు వివిధ విభాగాలలో పోటీలు ఉంటాయని, మహిళలంతా అధిక సంఖ్యలో పాల్గొని నారీ సత్తాను చాటాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మంగళవారం యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో హెల్త్ బేబీ పోటీలు జరుగుతాయని చెప్పారు. రాజమహేంద్రవరం, పరిసరాల్లోని ఐదేళ్లలోపు చిన్నారులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 63057 89433 నంబరులో సంప్రదించవచ్చన్నారు. అలాగే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే బామ్మ–మనవరాలి ఫ్యాషన్ షోలో పాల్గొనే బామ్మల వయస్సు 60 నుంచి 80 ఏళ్లు ఉండాలని, మనవరాలి వయస్సు ఐదు నుంచి పదేళ్ల వరకు ఉండవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.150 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 99126 62500 నంబరులో సంప్రదించవచ్చన్నారు.



క్యాంపస్‌లోని మహిళల కోసం..

అదే రోజు మహిళల కోసం కూడా ప్రత్యేక పోటీలు ఉంటాయని వీసీ తెలిపారు. యూనివర్సిటీతో పాటు, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌ల్లోని విద్యార్థినులు, ఉద్యోగినులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. గ్రూప్ సింగింగ్, ఫ్యాషన్ షో, స్కిట్, డాన్స్ వంటి పోటీలు ఉంటాయన్నారు. ఫ్రీ రిజిస్ట్రేషన్ అని, స్థానిక పాఠశాలల్లో కూడా పోటీలు నిర్వహించవచ్చన్నారు.

అనుబంధ కళాశాలల సిబ్బందికి..

రెండో రోజు మార్చి 5న యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గోదావరి జిల్లాల్లోని కళాశాలల సిబ్బందికి వివిధ పోటీలు ఉంటాయని వీసీ తెలిపారు. సృజనాత్మకతతో కూడిన వస్తువుల తయారీపై పోటీలు జరుగుతాయన్నారు. రూ.వంద చెల్లించి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల ఆరున జరిగే నారీ ఫెస్ట్–2025లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారన్నారు. యూనివర్సిటీ ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన స్థానానికి సహకరించాలి



సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2024లోని వివిధ అంశాల అమలు తీరును పరిశీలించేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ సభ్యులు వారం రోజుల్లో నగరంలో పర్యటించనున్నారని, అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాధిపతులు, నగరంలోని జిల్లా స్థాయి విద్యా శాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2023లో 59 సంపాదించిందని, ఈ ఏడాది ఇంకా మెరుగైన స్థానం సాధించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. డివిజన్ల ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన వార్డులలో విస్తృతంగా పర్యటించి, సిటిజెన్ ఫీడ్ బ్యాక్‌కు సంబంధించి ప్రజలలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఇంటింటి చెత్తను వేరు చేసి, పారిశుధ్య వాహనాలకు అందించి స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలన్నారు. వ్యాపారస్తులు, తోపుడు బండ్ల వారు చెత్తను డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ పూర్తి స్థాయిలో చేసి, స్వచ్ఛతలో అత్యున్నత ర్యాంక్ వచ్చేలా భాగస్వాములు కావాలన్నారు.

8న పీఓడబ్ల్యూ విలీన సభ

రాజానగరం: ఒంగోలులో ఈ నెల 8న జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) విలీన సభను విజయవంతం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి బచ్చల శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. మండలంలోని సూర్యారావుపేటలో ఉన్న అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఈ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పీఓడబ్ల్యూ నిరంతరం పోరాడుతుందన్నారు. 2013లో రెండుగా చీలిపోయిన ఈ సంస్థను బలోపేతం చేయడం అవసరమని భావించి, విలీనం చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘ డివిజన్ ప్రతినిధులు మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తుమ్మల కళావతి, గోర్స దుర్గ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో ఫీజు దోపిడీని అరికట్టాలి

డీవీఎంసీ సభ్యుడు గొట్టిముక్కల

రాజమహేంద్రవరం సిటీ: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి, ఫీజు దోపిడీని అరికట్టాలని డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు డీఈఓను కోరారు. సోమవారం స్థానిక కోటగుమ్మం వద్ద ఉన్న డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యా శాఖాధికారి వాసుదేవరావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ, ఫీజులు చెల్లించలేదని పేద విద్యార్థులను పరీక్షలు రాయనీయకుండా కొన్ని పాఠశాలల నిర్వాహకులు తోటి విద్యార్థుల ముందు వారిని దుర్భాషలాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి చర్యలతో విద్యార్థులు ఒత్తిళ్లకు లోనై, వారి మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆడపిల్లల భద్రతకు చేపడుతున్న చర్యలపై స్కూళ్ల నుంచి వివరణ తీసుకోవాలని కోరారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్కూళ్లలో వసూలు చేస్తున్న ఫీజులు, సంస్థ గుర్తింపు నంబర్‌ను బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. ఆర్టికల్ 21ఏ ప్రకారం విద్యార్థులను కొట్టడం, మానసికంగా హింసించడం, ప్రవేశ పరీక్ష నిర్వహించడం, క్యాపిటేషన్ ఫీజు వసూలు, టీచర్లు ట్యూషన్ చెప్పడం, గుర్తింపు లేకుండా స్కూల్ నడపడం నిషేధమని స్పష్టం చేశారు. కొన్ని పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.



డీఈఓకు మొక్కను అందజేస్తున్న అనంతరావు